నగరంలో మద్యం పరవళ్లు!

- మద్యం దుకాణాల వద్ద అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు
- వాడవాడలా బెల్ట్ షాపులు
- రోడ్లపై మందుబాబుల హల్‌చల్
- పోలీసులను లెక్కచేయని వైనం
- ప్రేక్షక పాత్రలో ఎక్సైజ్ శాఖ



కుంచనపల్లిలో ఓ వైన్‌షాపు వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్‌లో మద్యం సేవిస్తున్న మందుబాబులు

తాడేపల్లిరూరల్: ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం అమ్మినా, బెల్ట్‌షాపు నిర్విహించినా రూ.5 లక్షల వరకు జరిమానా, బెల్ట్ షాపు నిర్వహిస్తూ రెండవసారి పట్టుబడితే లిక్కర్ షాపు లైసెన్స్ రద్దుచేస్తామంటూ పదేపదే మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నంగా వుంది. మద్యం షాపుల మధ్య అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో అంగళ్లలో సైతం మద్యం అమ్మకాలు జరుగుతుండడంతో పూటుగా మద్యం తాగి మందుబాబులు రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. ఇటీవల మంగళగిరి నియోజకవర్గంలో పలు మద్యం దుకాణాల వద్ద మద్యం బాబులు చేస్తున్న ఆగడాలను ప్రజలు వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెడుతున్నారు.

> ఉండవల్లి సెంటర్‌లో ఒకటో వార్డు వద్ద ఒక జేబుదొంగ ఇటీవల మద్యం తాగి అరగంట సేపు రోడ్డుపై హల్‌చల్ చేస్తూ రాకపోకలు సాగించేవారిని భయభ్రాంతులకు గురిచేశాడు. స్థానికంగా ఉన్న అతని బంధువులు బుద్ధిచెప్పి ఇంటికి పంపించారు. ఇదే రహదారిలో ఓ ఆటోడ్రైవర్ రాత్రి సమయంలో ఇంటికి వెళుతుండగా మద్యం మత్తులో అతనిపై కొందరు విచక్షణా రహితంగా దాడి చేయడంతో చేయి విరగడంతో పాటు కంటికి గాయమైంది. వాడవాడలా బెల్టుషాపులు, మద్యం దుకాణాల వద్ద అనధికార పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసి మరీ తాగినోడికి తాగినంత మద్యం పోస్తుండడంతో మందుబాబులు హల్‌చల్ చేస్తూ నగర ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

బాటిల్‌పై అధనం..

మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 23 మద్యం దుకాణాలు ఉండడంతో ఆ షాపుల నుంచి కొంతమంది మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా ఎక్కువ మోతాదులో మద్యం కొనుగోలు చేసి ఎక్కడ పడితే అక్కడ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. మద్యం దుకాణాల నుంచి కొంతమంది బాటిళ్లు కొనుగోలు చేసి ఒక బాటిల్‌మీద ఆయా ప్రాంతాలను బట్టి రూ.50–70లకు అధిక ధరకు అమ్ముతున్నారు.

యథేచ్ఛగా అనధికార పర్మిట్ రూమ్‌లు

ఎంతోమంది వీవీఐపీలు నివాసముండే కుంచనపల్లి ప్రాతూరు రోడ్డులో ప్రాంతంలో ఓ వ్యక్తి అనధికారికంగా పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసి ఆ వైన్స్‌లోనే గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు, మద్యం తాగేటప్పుడు అవసరమైన స్నాక్స్ కూడా అమ్ముతున్నాడు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్థానికంగా నివాసముంటున్నారు, ఇక్కడ పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేయవద్దని టీడీపీకే చెందిన మండల స్థాయి నాయకులు చెప్పినప్పటికీ మేం అమ్మేది అమ్మేదే అంటూ అనధికారికంగా పర్మిట్ రూమ్ ఏర్పాటు చేశాడు. మరో రెండు మూడు షాపుల్లో అయితే మద్యం బాటిళ్లను డోర్ డెలివరీ అందిస్తున్నారు. ఈ సంఘటనపై ఎక్సైజ్ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు వార్నింగ్ ఇచ్చినా కొంతమంది స్వార్థ రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

బహిరంగ ప్రదేశాల్లో హల్‌చల్..



బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న దృశ్యం

కుంచనపల్లి రోడ్డు, వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ప్రాంతం, సాయిబాబా గుడి వద్ద, మంగళగిరి ఎర్రబాలెం రోడ్డు, నిడమర్రు రోడ్డులో, రేవేంద్రపాడు బ్రిడ్జి వద్ద ఇలా వైన్స్‌షాపు ఉన్న ప్రతి చోటా అక్కడే మద్యం కొనుగోలు చేసి పక్కనే వున్న బడ్డీ కొట్టులో గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు కొనుగోలు చేసి బహిరంగ ప్రదేశాలు, పార్కులు, ఆటోల్లో కూర్చుని మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. పోలీసులు కొన్ని కేసులు నమోదు చేస్తున్నా మందుబాబుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. మద్యం ఎక్కువై రోడ్లపై పడిపోతున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడం విశేషం.

క్లుప్తంగా

పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పలు పురుగుమందుల దుకాణాలను దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రబీ సీజన్‌లో వేసుకునే మొక్కజొన్న, జొన్న, పెసర పైర్లకు ముందుగా ఈ–క్రాప్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. పంట బీమా పథకం కింద వేసిన పంటలకు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని కామన్ సర్వీస్ సెంటర్‌లో పంట బీమాను చేయించుకోవాలని, మొక్కజొన్న పంటకు ఎకరాకు రూ.114, జొన్నకు రూ.48, పెసర రూ.45 చెల్లించవలసి ఉంటుందని, ఈ నెల 31వ తేదీ వరకు ఈ అవకాశం ఉందన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

ఫిరంగిపురం: తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగి బంగారం పోయిన సంఘటన మండలంలోని నుదురుపాడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మందాళ రమాదేవి తన ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల పదోతేదీన ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లింది. తలుపులు తీసి ఉన్నాయని సమీపంలోని వారు రమాదేవికి ఫోన్ చేయడంతో ఇంటికి వచ్చి చూడటంతో బీరువాలోని రూ. 60 వేల విలువైన బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించింది. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని సీఐ రవీంద్రబాబు, రైటర్ దాసు, వేలిముద్రనిపుణులు పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోదారంగనాథునికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గీతామందిరంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో గోదా రంగనాథ స్వామికి శనివారం 13వరోజు విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకుడు రాజేంద్రశర్మ ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు చేసి విశేష అలంకారం చేశారు. అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహించారు. వాసవీ మహిళమండలి, గీతాభజన మండలి సభ్యులు గోదాదేవి పాశురాలు, లలితా స్తోత్రం పారాయణ కావించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ నరేంద్రకుమార్, కొత్తమాసు వెంకటేశ్వర్లు, గుగ్గిళం మధుసూధన్‌లు పర్యవేక్షించారు.

రేపు వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

తాడేపల్లిరూరల్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఈనెల 30వ తేదీన నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు. శనివారం తాడేపల్లి సీపీఎం కార్యాలయంలో సీపీఎం, సీపీఐ, ఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లి ఎంటీఎంసీ కార్యాలయం ఎదుటవున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని అన్నారు. పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, ఎంఎల్ పార్టీ నాయకులు కె.ఆదినారాయణ మాట్లాడారు. వామపక్షాల నాయకులు వేముల దుర్గారావు, డి.వి.భాస్కర్ రెడ్డి, కె.బాబూరావు, డి.విజయ్‌బాబు, కె.మేరి, దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చర స్వామికి పూజలు



తాడేపల్లిరూరల్: శనిత్రయోదశి పురస్కరించుకుని మంగళగిరి గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నవగ్రహ మండపంలో శనివారం భక్తులు శ్రీ శనైశ్చర స్వామికి ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి జేవీ నారాయణ మాట్లాడుతూ భక్తులు స్వామివారికి నువ్వుల నూనెతో అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించి పురోహితులకు నువ్వుల దానాలు అందజేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు టి.మహేష్ శర్మ, పురోహితులు టి.శ్యామసుందర శాస్త్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారని, భక్తులు తెల్లవారుజాము నుండే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు గావించారని తెలిపారు.

వివేకానంద విగ్రహం తొలగించవద్దంటూ వినతి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఇప్పటం, ఆత్మకూరు రహదారి మూడు రహదారుల కూడలిలో నిరుపయోగంగా వున్న స్థలంలో శ్రీ స్వామి వివేకానంద విగ్రహాన్ని గతంలో ఏర్పాటు చేశారు. ఆ విగ్రహం తొలగిస్తామంటూ కార్పొరేషన్ అధికారులు చెప్పడంతో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో విగ్రహ కమిటీ నాయకులు, గ్రామస్తులు ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ 2020 జూన్ 25న ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తుల సహకారంతో పార్కును ఏర్పాటు చేశామని, ఇప్పుడు ఎంటీఎంసీ టౌన్ ప్లానింగ్ డీసీపీ అశోక్‌కుమార్ విగ్రహం తొలగించి రోడ్డు నిర్మిస్తామని సమాచారం ఇచ్చారని, ఆ విగ్రహం చుట్టూ త్రికోణ స్థలానికి దక్షిణం వైపు సుమారు 18 అడుగులు, ఉత్తరం వైపు 35 అడుగులు, తూర్పువైపు 25 అడుగుల వెడల్పు గల శాశ్వత రోడ్డు నిర్మాణం ఉన్నాయని సాధ్యమైనంత వరకు ఆ రోడ్లను వినియోగించి విగ్రహం తొలగించవద్దని, 2025 జనవరి 12వ తేదీన శ్రీ స్వామి వివేకానందుని జయంతి కార్యక్రమం ఉందని అప్పటి వరకైనా ఆ విగ్రహాన్ని యధాతధంగా ఉంచాలని కోరామని తెలిపారు. లచ్చి వెంకటేశ్వరరావు, తులసిదాస్, ఎంవి రెడ్డి, వీరంకి ప్రవీణ్, విష్ణు, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మంపై అసత్య ప్రచారాలు మానుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యులు

తాడేపల్లిరూరల్: హిందూ ధర్మంపై అసత్య ప్రచారాలు మానుకోవాలని గుంటూరు హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యులు వేణుగోపాల్ అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్ పెనుమాక సూర్యదేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ప్రతి ఒక్కరు హిందూ ధర్మాన్ని ద్వేషించే విధంగా మాట్లాడుతున్నారని, ఏదో లబ్ధి పొందాలని చూస్తున్నారని, హిందూధర్మం మీద అసత్యారోపణలు చేస్తేనే వారు వెలుగులోకి వస్తారని ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. విశ్వహిందూ పరిషత్ గుంటూరు నగర అధ్యక్షుడు కాలిశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన ఒక దినపత్రిక(సాక్షి కాదు)లో వైష్ణవి దేవాలయం అనుమతులు లేకుండా నిర్మించారని ప్రచురించారని, అయితే ఇంతవరకు కోర్టు నుంచి క్షేత్రాలయానికి ఎటువంటి నోటీసులు రాలేదని అన్నారు. దేవాలయాల భూములు, గోవుల సంరక్షణ కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. గుంటూరు గో సంరక్షణ సమితి నాయకులు హరిహరరాయులు మాట్లాడుతూ హిందూ మత వ్యతిరేక శక్తులు పంచాయతీ భూములను, రోడ్లను ఆక్రమించి గుడి నిర్మాణం జరిగిందని చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. హిందూ దేవాలయం గురించి హిందూ మతం గురించి, మతస్తుల గురించి అన్యమతస్తులు చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కంచిబోతుల హర్షవర్ధన్, లక్ష్మి, రామానుజ, అడపా ఫణీంద్ర, సుబ్బునాథ్, కలిశెట్టి కోటేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన ఆధార్ క్యాంపులు

తాడికొండ: తుళ్లూరు మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజుల నుంచి కొనసాగుతున్న ఆధార్ ప్రత్యేక క్యాంపులు శనివారంతో ముగిసినట్లు ఎంపీడీఓ కానూరి శిల్ప ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు వివిధ గ్రామాల్లో 220 మందికి వివిధ రకాల ఆధార్ సర్వీసులు అందించినట్లు తెలిపారు.

గడ్డిమందు పిచికారీ



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్‌పరిధిలోని ఉండవల్లి గ్రామంలో ఉన్న జేఎస్ఎన్ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పలుచోట్ల పిచ్చిమొక్కలు చనిపోయేందుకు గడ్డిమందు పిచికారీ చేయించారు. ఉండవల్లి హిందూ స్మశానవాటికలో మనుషులు నడవడానికి వీలులేకుండా గడ్డి పెరిగింది. అక్కడ మరియు దళితవాడ, అమరారెడ్డి నగర్, కరెంటు ఆఫీసు తదితర ప్రాంతాల్లో గడ్డిమందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయపూడి కిరణ్, సంకురు ప్రశాంత్, జొన్న శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: మంగళగిరి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాసిని మల్టీ స్పెషాలిటీ కంటి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రహీమ్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఆకుల జయసత్య ప్రారంభించనున్నారని, ముఖ్య అతిథులుగా తాడేపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షుడు రావూరి రమేష్‌బాబు, ఎం.ఎం.కె. స్టేడియం ఉపాధ్యక్షుడు పితాళ్ళ మస్తాన్ రావు, మంగళగిరి రోటరీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావులు హాజరుకానున్నారన్నారు. ఈ వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నామని, నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నామని, అవసరమైన రోగులకు కంటి పొరలు, కంటి శుక్లాల ఆపరేషన్లు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితం చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని మంగళగిరి పట్టణ పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ రహీమ్ బాషా ఆ ప్రకటనలో కోరారు.

నేడు సైబర్ నేరాలపై అవగాహన

తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి నెలవారీ సమావేశం ఆదివారం జరగనుంది. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు ఏర్పాటయే సమావేశానికి సంఘ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహిస్తారు. 'సైబర్ నేరాలు–అవగాహన'పై తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు ప్రత్యేక ప్రసంగం చేస్తారు. సభ్యులందరూ హాజరై సైబర్ నేరాలపై అవగాహనకు రావాలని కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

పొన్నెకల్లులో సీపీఐ శతవార్షిక ఉత్సవాలు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

తాడికొండ: పేదలకు అండ ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పొన్నెకల్లు గ్రామంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం పార్టీ శత వార్షిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ మాట్లాడుతూ దేశంలో అనేక సమస్యలపై సీపీఐ అలుపెరుగని పోరాటాలు చేసి వాటిని సాధించిందని గుర్తు చేశారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని గత నాలుగు సంవత్సరాలుగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు వివిధ రూపాలలో ఆందోళనలు కొనసాగిస్తున్నారని ప్రధాని మోదీ స్పందించడం లేదని ధ్వజమెత్తారు. గ్రామాలలో సీపీఐ బలపడవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం నుంచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు సాగించింది కమ్యూనిస్టు పార్టీ అని గుర్తు చేశారు. పొన్నెకల్లు సీపీఐ కార్యాలయం, ఉర్దూ స్కూలు, సత్రం సెంటర్, అంబేడ్కర్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల సాంబశివరావు, పార్టీ తాడికొండ ఏరియా కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, గ్రామ కార్యదర్శి రామినేని రామారావు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు



సింగరయ్య కొండ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్ల తెల్లక్వారీ సమీపంలోని సింగరయ్య కొండ వద్ద జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను నిలిపివేయాలంటూ పేరేచర్ల గ్రామస్తులు శనివారం ఆందోళనకు దిగారు. కుల మతాలు, పార్టీలకతీతంగా ప్రజలు ఏకమై సింగరయ్య కొండ పరిరక్షణలో భాగంగా ఆందోళనకు దిగారు. సింగరయ్యకొండ చుట్టుపక్కల 500 మీటర్ల వరకు ఎలాంటి బ్లాస్టింగ్ చేయకుండా మైనింగ్ జరగకుండా ఉండాలని నినాదాలు చేశారు. కొండ మీద ఉన్న జలపాత కొలను అక్రమ మైనింగ్ దెబ్బకు కనుమరుగైందని వాపోయారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో తొలి ఏకాదశి పండుగ రోజున ప్రతి సంవత్సరం సింగరాయకొండ వద్ద తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తుంటామన్నారు. కొన్ని దశాబ్దాల నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతుందని, పేరేచర్లతోపాటు పరిసర ప్రాంత గ్రామాల నుంచి ప్రజలు ఇక్కడకు తొలి ఏకాదశి తిరునాలకు వచ్చి సింగరయ్యను స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారన్నారు. సింగరయ్య కొండ సర్వేనెంబర్ 155/ ఏ1 లో ఉన్న కొండపైన సింగరయ్య గుడి ఉందని ఆలయానికి ఎలాంటి ముప్పు లేకుండా క్వారియింగ్ బ్లాస్టింగ్ నిలిపివేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో పేరేచర్ల మాజీ సర్పంచ్ గడ్డం రాంబాబు, మండల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాములపాటి శివన్నారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాములపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విధించిన విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడి గ్రామంలో శనివారం సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి సంబంధించిన విద్యుత్ వాడకం సర్దుబాటు చార్జీల రూపంలో ప్రజలపై భారాలు వేస్తున్నారని, స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజల వద్ద అధికంగా బిల్లులు వసూలు చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచమని చెప్పి ఆరు నెలలు గడవక ముందే ప్రజలపై కరెంటు భారాలు మోపుతున్నారని అన్నారు. పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, మండల నాయకులు వై.స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరరావు, అద్దంకి పాములు, రాంబాబు, శివాంజనేయులు, వై.సుధ, ఎం.యేసుపాదం పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



బైక్ ర్యాలీలో పోలీసు అధికారులు, సిబ్బంది


తెనాలిరూరల్: తెనాలి పోలీస్ సబ్ డివిజన్ అధికారుల ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై పట్టణ ప్రజలకు, వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి స్వయంగా హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ ర్యాలీ చేపట్టారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద నుండి ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని డీఎస్పీ బి. జనార్ధనరావు ప్రారంభించారు. యార్డు నుండి కొత్తవంతెన, గాంధీచౌక్, రజక చెరువు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకూ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో సీఐలు మల్లికార్జునరావు, రాములు నాయక్, రమేష్ బాబు, శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది హెల్మెట్లు ధరించి వాహనాలు నడుపుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. అలానే హెల్మెట్ వాడకం ద్వారా అనుకోకుండా ప్రమాదం జరిగినా ప్రాణాలకు ముప్పు వాటిల్లదని తెలియజేశారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులతో పాటు పట్టణంలో వివిధ ఆటో మొబైల్స్ వాహన షోరూమ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

బహు వార్షికాలతో పాడి రైతులకు మేలు

ఫిరంగిపురం: బహువార్షికాలతో పాడిరైతులకు ఎంతో మేలు చూకూరుతుందని పశువైద్యాధికారి పీర్ అహ్మద్ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి పీర్ అహ్మద్ మాట్లాడుతూ 50 సెంట్లు సొంతస్థలం ఉన్న రైతులకు గడ్డి విత్తనాలు అందజేస్తామన్నారు. దాని కోసం జాబ్‌కార్డు, పాస్‌పుస్తకం, రేషన్ కార్డు జిరాక్స్ అందజేయాలని చెప్పారు. గడ్డి విత్తనాలు నాలుగు సార్లు తడుపు తడుపునకు కోతకు వస్తుందన్నారు. మండలంలో జాతీయ పశుగణన సర్వే జరుగుతుందని చెప్పారు. హౌసింగ్ ఇంచార్జి ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హులైన వారు ఇంటి నిర్మాణం కోసం ఆయాగ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇప్పటివరకు ఇంటి నిర్మాణాలు చేపట్టనివారు త్వరగా చేపట్టాలని కోరారు. పలుశాఖల అధికారులు ఆయాశాఖల గురించిన వివరాలు తెలియజేసారు. ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, వైస్ ఎంపీపీ జి.చంద్రం, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల అభివృద్ధికి కృషిచేసిన శేషంరాజు

ఏడో వర్ధంతి సభలో కేసన శంకరరావు



శేషంరాజు విగ్రహం వద్ద నివాళి

తెనాలి: పట్టణానికి చెందిన సేవారత్న తంగెళ్ల శేషంరాజు బీసీ కులాలకు, రాష్ట్రవ్యాప్త భట్రాజు సంఘీయుల అభివృద్ధికి విశేషంగా కృషిచేశారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భట్రాజు సంఘీయులకు ఇళ్లస్థలాలను ఇప్పించటం, ఇళ్లు నిర్మాణానికి ఆర్థికసహాయం చేశారని గుర్తుచేశారు. తెనాలి రామలింగేశ్వరపేట రాజుల కాలనీలోని శ్రీ సత్యసాయిబాబా మందిరంలో 'సేవారత్న' తంగెళ్ల శేషంరాజు ఏడో వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి శంకరరావు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భట్రాజు సంఘాల ఫెడరేషన్ ఏర్పాటు చేశారని చెబుతూ, గల్లీ నుండి ఢిల్లీ వరకు ఆనాటి ప్రధానులు ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావులను తరచూ కలుస్తూ బీసీ సంఘాలకు కృషిచేశారని చెప్పారు. బీసీ సంఘాలకు ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు తెనాలి భట్రాజు సంఘం అధ్యక్షుడు లోలబట్టు గంగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త భట్టరాజ సంఘీయులకు అలాగే బీసీ సంఘాలకు ఆయన చేసిన సేవలు మరువలేనివనీ, ఆయన ఆశయ సాధన కోసం కృషిచే స్తామని చెప్పారు. ఆధ్యాత్మిక చింతనలో భాగంగా తెనాలి పట్టణ రాజుల కాలనీలో భగవాన్ శ్రీసత్య సాయిబాబా మందిరాన్ని నిర్మించారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్త భట్రాజులందరూ ఆయనకు రుణపడి ఉన్నామన్నారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తంగెళ్ల శేషంరాజు పేద బడుగు బలహీన వర్గాలకు చేదోడు వాదోడుగా ఉండేవారని అన్నారు. కూరపాటి కొండంరాజు, భల్లం రఘునాధేశ్వరరాజు. తంగెళ్ల సత్యనారాయణరాజు, కూరపాటి సీతారామరాజు పాల్గొన్నారు.

రేపు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



భట్టిప్రోలు: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం దేశ వ్యాప్తంగా వామ పక్ష పార్టీలు తలపెట్టిన నిరసన కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ, సీపీఎం పార్టీ నాయకులు బి. శ్రీనివాసరావు, ఎం.సత్యన్నారాయణ పిలుపునిచ్చారు. శనివారం భట్టిప్రోలులోని సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయా పార్టీల నాయకులు జి.బాలాజీ, వి.శ్రీనివాసరావు, పి.మనోజ్, పి.నాగాంజనేయులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లకు న్యాయంచేస్తాం

తాడేపల్లిరూరల్: ఉద్యోగాలు కోల్పోయిన వైద్య ఆరోగ్యశాఖలోని హెల్త్ అసిస్టెంట్లకు తప్పకుండా న్యాయం చేస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో ఆయన్ను ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న సుమారు 920 మంది హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగాల నుంచి తొలగించారని, ఉన్న ఫళంగా ఉద్యోగం కోల్పోవడంతో తీవ్ర మానసిక క్షోభకు గురి కావడమే కాకుండా వారిపై ఆధారపడ్డ కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయని వివరించామన్నారు. ఈ విషయమై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి బాధితులకు అన్యాయం జరగకుండా చూస్తానని పల్లా శ్రీనివాసరావు హామీఇచ్చారన్నారు. ప్రజావేదిక కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సైతం ఉద్యోగాలు కోల్పోయిన హెల్త్ అసిస్టెంట్లు కలిసి వినతి పత్రం ఇచ్చారు.